వెరైటీగా
చావాలనే
అతని కోరిక
ఎలా తీరింది?

# అతని పేరే మగాడు

అలపర్తి
రామకృష్ణ
కథ

సంజీవరావు బ్రతకడం ఎలాగో తెలిసిన మనిషి.

మృత్యు లోయల్లో రెండు మూడుసార్లు పడిపోయి ఒడ్డుకు చేరిన మనిషి. మృత్యువంటే మక్కువ అతనికి. అందుకే మృత్యువు అతన్ని కసిరి కొడుతుంది.

పుట్టిన మూడో రోజే కళ్లు తేలేయడంతో బ్రతకడనుకున్నారందరూ. పాతికేళ్ల వయస్సప్పుడు పచ్చ కామెర్లు సోకి మనిషి పీనుగులా తయారయ్యాడు. నడి వయస్సులో వోసారి బస్సు ప్రమాదంలో బస్సులోని వాళ్లంతా చనిపోగా అతను చావు తప్పించుకుని బయటపడ్డాడు.

అతని జీవన దృక్పథం కూడా వేరే.

రోజూ తినడం, నిద్రపోవడం, రోజూ పనిచేసే ఆఫీసుకు మొక్కుబడిగా వెళ్లడం, కాగితాలను నలుపు చెయ్యడం— ఇవన్నీ సగటు మనిషి చేసే పనులనుకుంటాడతను. 'ఈ రోజు'లాగే 'రేపు' కూడా వుంటే బ్రతకడం ఎందుకు.

ఈనాడుకు రేపుకు తేడా వుండొద్దూ!


బ్రతుకు దేవుడిచ్చిన వరం అనుకుంటాడతను.

జీవితాన్ని అందంగా మలుచుకోవడం గాని, బ్రతికినన్నాళ్లు శవంలా బ్రతికి శరీరాన్ని శ్మశానానికి చేరవేయడంగాని— మనచేతుల్లోనే వుంది.

సంజీవరావు స్వతహాగా ఆస్తిపరుడు.

ప్లీడరు వృత్తి చేపట్టేక మరింత ఆస్తిపరుడయ్యాడు. ఒక్కతే కూతురవ్వడంతో మావగారి ఆస్తి కూడా అతనిదే.

పెద్ద బంగళా, మారుతీకారు,బంగారపు



కంపు కొట్టే బ్యాంక్ లాకర్లు, నిండు గర్భిణిలా వున్న బ్యాంక్ బ్యాలెన్స్— శుభ్రంగా బ్రతకొచ్చు వాటన్నిటితో.
శుభ్రంగా బ్రతకడంలో థ్రిల్ ఏముంది! రూపాయల్ని, పిల్లల్నీ లెక్క పెట్టుకుంటే ఆనందమేముంది! అదీ అతని ఆలోచన.
బురదలోకి దిగి తామరపువ్వు అందుకుంటే సంతోషం కల్గుతుందిగాని, ఫ్లవర్ వేజ్

లో పువ్వుల్ని చూస్తే ఆనందమేముంది!

బంగారం లాంటి పెళ్లాన్ని, బాంక్ బాలెన్స్‌ను ఖాతరు చెయ్యకుండా వంట మనిషితో వుడాయించేడు.

వంట మనిషి అందం అతన్ని వివశుడిని చేసింది.

ఆ అమ్మాయి సన్నిధిలో బంధువుల్ని, బ్యాంక్ నిధుల్ని మర్చిపోయాను. డబ్బు కోసం ఇబ్బంది లేకుండా వంట మనిషితోనే మారుమూల ప్రాంతంలో మూడేళ్లు గడిపాడు.

ఎడ తెరిపిలేని ముద్దు ముచ్చట్లతో మూడేళ్లు మూడు నిముషాల్లా గడిచిపోయాయి.

వంట మనిషి మరో ప్రియుడితో వుడాయించేసింది సంజీవరావుకు మాట మాత్రం చెప్పకుండా.

స్వగ్రామం తిరిగి వొచ్చేడు. ఆ అమ్మాయి వెళ్లిపోయిందని అతను విచారపడలేదు. సంజీవరావులో మార్పు లేకపోవడం, నవ్వుతూనే అతను అందరినీ పలకరించడం అయిన వాళ్లకి విచిత్రంగా తోచింది.

"సీతాదేవి లాంటి భార్యను పట్టించుకోకుండా దేనితోనో తిరిగివొచ్చావ్... నువ్వు సాధించిందేమిటి" అడిగాడు వో బంధువు.

"ఈ మూడేళ్లు యిల్లు వొదిలి పెట్టకుండా వుంటే మాత్రం నేను సాధించేది ఏముంది!" ఎదురు ప్రశ్న వేశాడు సంజీవరావు.

'నీకేమయ్యా పేరున్న ప్లీడర్‌వి.. ఈ మూడేళ్లలో పది లక్షలు వెనుకవేసుకునేవాడివి'

"లక్షలు లెక్క పెట్టుకోవడమేనా జీవితం... మూడేళ్లలో ముగ్గురు పిల్లల్ని కని ముప్పయి లక్షలు సంపాదించి అందరిచేత మంచి వాడిననిపించుకుంటే నాకు ఒరిగేదేముంది!" అన్నాడు సంజీవరావు నవ్వుతూ.

"నువ్వు తీసుకువెళ్లిన అమ్మాయి నిన్ను వదిలేసిందంటే నీమీద దానికి గౌరవమెంత వుందో తెలుస్తూనే వుంది"

"ఆ అమ్మాయి వెళ్లిపోయినా ఆ మూడేళ్లలో నేను పొందిన అపురూపమైన అనుభవాల్ని ఎవ్వరూ లాక్కోళ్లలేరుగా!"

"నీతో వాదించడం నాది బుద్ధి తక్కువ" అనేసి వెళ్లపోయాడు సంజీవరావు బంధువు.

అతను ఇంటికి తిరిగొచ్చేక కుదురుగా వుంటాడని అందరూ అనుకున్నారు మొదట్లో.

అమ్మాయిలతో తిరగడం మానలేదతను.

ప్లీడరీ వృత్తిమీద కంటే పడుచు పిల్లలమీద, పూల మొక్కలమీద ఎక్కువ శ్రద్ధ చూపిస్తూ వుండటంతో అతని భార్య విసిగిపోయింది. పిల్లల్ని తీసుకుని పుట్టింటికెళ్లింది.

కాలచక్రం తిరుగుతూనే వుంది.

సంజీవరావుకు వయస్సు మీద పడింది. తొంభయ్యో పడిలో పడ్డాడు. అయినా మొహంమీది చిరునవ్వు ఎప్పుడూ చెదిరిపోనివ్వడు.

ఈ ముసలాడు ఎప్పుడు చనిపోతాడని యింట్లో నౌకర్లు, బంధువులు ఎదురు చూస్తూ కూర్చున్నారు.

అందరూ తన చావు కోసం ఎదురు చూస్తున్నారని సంజీవరావు తెలుసుకున్నాడు

అందరిలా బ్రతకడం, అందరిలా చనిపోవడం అతనికిష్టం లేదు.

చావులో కూడా తన ప్రత్యేకత వుండాలనుకున్నాడు.

దగ్గరి బంధువుని పిలిచాడు సంజీవరావు.

"ఇదిగో కామయ్యా! నేను ఎక్కువ రోజులు బ్రతుకనయ్యా! అయిన వాళ్లందరికి కబురు చెయ్యి... ఈ రోజు మంగళవారం కదా... సరిగ్గా శనివారంనాడు నేను కన్ను మూయాలనుకుంటున్నాను.. ఇంటికి వొచ్చిన వాళ్లందరికీ బట్టలు పెట్టి అందరినీ ఆనందపర్చి చచ్చిపోవాలనుకుంటున్నాను... శనివారంనాడు చుట్టాలందరినీ వొచ్చేయ్యమను".

తలూపి వెళ్లిపోయాడు సంజీవరావు బంధువు.

శనివారంనాడు అతనికి తెలిసినవాళ్లు, బంధువులు ఇంట్లో ఇసుకవేస్తే రాలనట్లు చేరుకున్నారు.

అతను ఎప్పుడు చనిపోతాడాని ఎదురు చూస్తూ కూర్చున్నారు. వంటలు చేసేవాళ్లు వంటలు చేస్తున్నారు. భజనలు చేసేవాళ్లు గోవిందనామ స్మరణ చేస్తున్నారు. ఇంటి చుట్టూ తిరుగుతూ పిల్లలు ఆడుకుంటూ వున్నారు. సందడిగా వుందక్కడ.

మంచంమీద పడుకుని అందరివంక చిద్విలాసంగా చూశాడు సంజీవరావు.

"అందరిలా మంచం మీద పడుకుని చివరి క్షణాలు లెక్కపెట్టుకోవడం నాకు యిష్టం లేదు" అన్నాడు సంజీవరావు.

"అయితే నేలమీద పడుకోండి" సలహా యిచ్చేడు వొకతను.

"మనదంతా ప్రత్యేకంగా వుండాలి... అందరిలా చనిపోకూడదు.. నా చివరి క్షణాలు శ్మశానంలో గడుపుతాను" అన్నాడు సంజీవరావు.

## మద్యం



సారాయి తాగనివాడు సారంగధరుడు అనేది పాతకాలపు మాట. నేడు సారా మూలంగా ఎన్నో సంసారాలు చిన్నాభిన్నమై పోతున్నాయి. ఎంతోమంది ప్రాణాలు గూడా కోల్పోతున్నారు. ఫ్రాన్స్‌లోని బెసాన్‌కన్ నగరంలో ఓ మందుబాబు తాగితాగి పోసుకున్నాడు. వాస్తవంగానే తలకు పోసుకొని మత్తు మైకంలో మంచమంతా కూడా తడిపేసుకున్నాడు. ఈ మత్తుకు ఒక సిగరెట్ కాలిస్తే మజాగా ఉంటుందని అనుకొన్నాడు. అంతే లైటర్ వెలిగించాడు. రమ్ముతో తడిసిన తాను, తన మంచం అన్నీ భగ్గున మంటలందుకున్నాయి. చూడు. తుచ్ఛసుఖం విలువైన ప్రాణాల్ని తోడేస్తుంది. జాగ్రత్త సుమా!

— చెన్నా రామమూర్తి

అందరూ శ్మశానంవైపు నడిచేరు. సంజీవరావుకూడ నడుచుకుంటూనే శ్మశానం చేరుకున్నాడు.

"అందరిలా కట్టెలా బిగుసుకుపోయి పడుకుని చనిపోవడం నాకు యిష్టం లేదు... పద్మాసనం వేసుక్కూర్చుని చనిపోతాను" అన్నాడు సంజీవరావు.

"వెనుకటి రోజుల్లో ఋషులు, వేద పండితులు పద్మాసనం వేసుకూర్చుని వాళ్ల యిష్టానుసారంగా ప్రాణాలు వొదిలేవాళ్లట" అన్నాడొకాయన.

"వేరొకరు చేసిన పని నేను చెయ్యను.. నాదంతా కొత్త పద్ధతిలో వుండాలి... నేను నిలబడే చనిపోతాను".

"అదీ లాభం లేదండీ జైన గురువొకాయన నిలబడే తన ప్రాణాలు అనంత వాయువుల్లో కలిపేశాడట" అన్నాడు కామయ్య.

మళ్లీ చర్చలు మొదలయ్యాయి సంజీవరావు కొత్త పద్ధతిలో చనిపోయే విషయం గూర్చి.

సంజీవరావు చాలాసేపు ఆలోచించి వో నిర్ణయానికి వొచ్చేడు.

శ్మశానంలోనే వున్న చింతచెట్టుకు చేరబడి శీర్షాసనం వేశాడు. కళ్లు మూసుకుని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆపేశాడు సంజీవరావు.

శీర్షాసనం వేసుకుని సంజీవరావు మృత్యు మొహం పెట్టడం అందరినీ కలిచివేసింది.

"పాపం... ముసలాయన చివరి క్షణాల్లో వున్నాడు... ఆయన భార్యను పిలిపిస్తే బాగుంటుంది" సలహా యిచ్చేడు వో వ్యక్తి.

కారులో సంజీవరావు భార్యను తీసుకు వొచ్చారు అక్కడికి.

భర్త వైపు పరిశీలనగా చూసింది.

ఎదురుగా నిలబడ్డ వో పడుచుపిల్లవైపు భర్త కన్నుగొడుతున్నట్లనిపించిందామెకు.

"మిమ్మల్ని పిచ్చివాళ్లను చేశాడు మా ఆయన... శీర్షాసనం వేసే ఓపిక మనిషికి వుందంటే మరో పదేళ్లు నిక్షేపంగా బతుకుతాడు... ఆయన్ని ఇక్కడే వొదిలేసి మీరు ఇంటికి వెళ్లి భోజనాలు చేయండి" అందామె.

విసుక్కుంటూ అక్కడ నుంచి వెళ్లిపోయింది సంజీవరావు భార్య.

"ఇదిగో నీ చావు నువ్వు చావు... మమ్మల్ని అనవసరంగా పిచ్చివాళ్లను చెయ్యకు" అన్నాడో నడివయస్సులో వున్న మనిషి.

అందరూ అక్కడి నుంచి కదిలారు సంజీవరావును శ్మశానంలోనే వొదిలేసి.

కథ అడ్డం తిరిగిందని గ్రహించేడు సంజీవరావు.

శీర్షాసనం మానేసి మామూలుగా నిలబడి నవ్వుకున్నాడు.

*

